# రైతు కంట కన్నీరు!




- అన్నదాతను విస్మరించిన కూటమి సర్కార్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా రైతు ఇంటి వద్దకే సేవలు
- ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసిన చంద్రన్న ప్రభుత్వం

అన్నదాతకు విత్తనం నుంచి విక్రయం వరకు అన్ని రకాల వ్యవసాయ సేవలను వారి చెంతకే అందజేయడానికి గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల వ్యయంతో రైతు భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను సాంకేతికపరంగా పొందడానికి వీలు కలిగే ఏర్పాట్లు చేశారు. అటువంటి రైతు భరోసా కేంద్రాలు కూటమి సర్కార్ ఏర్పాటైన తరువాత దీనావస్థకు చేరిపోతున్నాయి. ప్రభుత్వం మారిన వెంటనే ఆర్‌బీకేల్లో కియోస్కో సేవలను మూలకు చేర్చేశారు. రైతు భరోసా కేంద్రాల్లోని డిజిటల్ కియోస్కో ద్వారా సాంకేతికంగా ఎన్నో రకాల సేవలు అందేవి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, అద్దెకు ఆధునిక యంత్రాలు, రైతు నికర ఆదాయం పెరగడానికి సూచనలు, పశు, మత్స్య, పౌల్ట్రీ తదితర సేవలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఉపయోగం, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సలహాలు, సూచనలు, ఈ-మార్కెటింగ్‌తో లాభసాటి ధరలు, కనీస గిట్టుబాటు ధరలు, గ్రేడింగ్, ప్యాకింగ్ తదితర సదుపాయాలు పొందేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితులు కనిపించడం లేదు. రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా కూటమి సర్కార్ పేరు మార్చినప్పటికీ సేవలు మాత్రం శూన్యమే. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రైతు భరోసా నిధులు కూడా ఇవ్వకుండా రైతులను ఉసురు పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఖరీఫ్ సీజన్ సైతం ప్రారంభం కావడంతో పెట్టుబడుల కోసం అన్నదాత ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో సకాలంలో పెట్టుబడి సాయం అందేదని గుర్తు చేసుకుంటున్నారు. – సాక్షి నెట్‌వర్క్



**టెక్కలి నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల వివరాలు**

| | |
|---|---|
| టెక్కలి | 20 |
| నందిగాం | 22 |
| సంతబొమ్మాళి | 20 |
| కోటబొమ్మాళి | 27 |

**ఇచ్ఛాపురం నియోజకవర్గంలో..**

| | |
|---|---|
| ఇచ్ఛాపురం | 18 |
| కంచిలి | 22 |
| కవిటి | 17 |
| సోంపేట | 24 |

**పలాస నియోజకవర్గంలో..**

| | |
|---|---|
| మందస | 29 |
| వజ్రపుకొత్తూరు | 27 |
| పలాస | 15 |
| పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ | 4 |

## రైతు భరోసా చెల్లించలేదు



రైతులకు రైతు భరోసా పథకం చెల్లించలేదు. దీంతో అప్పుచేసి కొద్దిపాటి వ్యవసాయమైన చేయక తప్పని పరిస్థితి. ఈ ఏడాది కూడా రైతు భరోసా పథకం వస్తుందో రాదో అన్న ఆందోళన రైతుల్లో ఉంది. రైతు భరోసా కేంద్రాలకు చాలా సచివాలయాల పరిధిలో భవన నిర్మాణాలు జరిగినప్పటికీ ఇప్పటి వరకు వాటిని ప్రారంభించాలనే చిత్తశుద్ధి కూటమి సర్కార్‌కు లేకపోవడం విచారకరం. – కడియాల ప్రకాశ్, రైతు, సిలగాం గ్రామం, కవిటి మండలం

## పేరు మార్చినా సేవలు శూన్యం



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి సర్కార్ రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారు. కానీ అప్పుడు అందించినన్ని సేవలు ఇప్పుడు వాటి ద్వారా అందడం లేదు. కేవలం విత్తనాలు, ఎరువులు పంపిణీకే పరిమితం అయ్యాయి. వీటి ఏర్పాటు లక్ష్యం నెరవేరడం లేదు. – పోకల హేమరాజు, రైతు, జింకిభద్ర, సోంపేట మండలం

## ఖరీఫ్ సీజన్‌పై ఆందోళనగా ఉంది



కూటమి ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి లబ్ధి లేదు. దీంతో రానున్న ఖరీఫ్ సీజన్‌పై ఆందోళనగా ఉంది. గత ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులతో పాటు సలహాలు, సూచనలు అందేవి. నేడు కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాత ఆర్‌బీకేల పేరు మార్చినప్పటికీ సేవలు అందడం లేదు. – వై.రాజారావు, రైతు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం



వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో టెక్కలిలోని ఆర్‌బీకే ద్వారా విత్తనాలు అందుకుంటున్న రైతులు (ఫైల్)



మందసలో కళతప్పిన రైతుభరోసా కేంద్రం

## సేవలు అందడం లేదు



రైతు సేవాకేంద్రాలుగా మార్చిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలు సక్రమంగా అందడం లేదు. ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌లు ప్రస్తుతం వినియోగించకపోవడం వలన మూలనపడ్డాయి. ఇక వీటి ద్వారా సేవలు నామమాత్రంగా ఉన్నాయనే చెప్పాలి. – మద్దు వెంకటరావు, రైతు, బూరగాం, కంచిలి మండలం



నందిగాం రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్కో యంత్రం

## రైతుకు మేలు చేసేలా ఉండాలి



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుకు కావల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఇంటి వద్దకు తెచ్చి ఇచ్చేవారు. ప్రస్తుతం ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవల్సి ఉంది. గత ఏడాది ఎరువులు రైతులకు కావల్సినన్ని అందించలేదు. ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుక్కొని వాడుకున్నాము. రైతుకు మేలు చేసేలా సేవా కేంద్రాలు ఉండాలి. – బాలక ప్రభాకరరావు, రైతు, దిమిలాడ, నందిగాం మండలం

## డిమాండ్ మేరకు ఎరువులు, విత్తనాలు వచ్చేవి



గత ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతుల డిమాండ్ మేరకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేవారు. కియోస్క్ మిషనరీతో తక్షణసేవలు పొందేవారు. ఇప్పుడు వాటి గురించి మాట్లాడితే తప్పుచేసినట్లు భావిస్తున్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో రైతుభరోసా కేంద్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పుడు తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చి రైతులను కష్టాల్లోకి నెట్టింది. – వల్లభ వైకుంఠరావు, నెమలినారాయణపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ



టెక్కలి మండలం అక్కవరం గ్రామంలో కియోస్క్ యంత్రాల ద్వారా సేవల పొందుతున్న రైతులు (ఫైల్)

## గతంలో రైతు వద్దకే సేవలందేవి..



గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎటువంటి సేవలు కావాలన్నా సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి వివరాలు అడిగి తెలుసుకొని సేవలు అందించేవారు. ప్రస్తుతం అటువంటి సేవలు అందడం లేదు. రైతులకు ఎటువంటి సేవలు కావాలన్నా గ్రామం నుంచి మండల కేంద్రం వరకు చెప్పులు అరిగేలా తిరగాల్సి వస్తుంది. గతంతో పోల్చుకుంటే రైతులు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. – టి.క్రిష్ణమూర్తి, వీరభద్రాపురం, పలాస మండలం

## అరకొర సేవలే..



రైతు భరోసా కేంద్రం పేరును రైతు సేవా కేంద్రంగా కూటమి ప్రభుత్వం మార్పు చేసింది. అయితే అందుకు తగ్గట్టుగా సేవలు మాత్రం అందడం లేదు. గతంలో ఇంటికి వచ్చి విత్తనాలు, ఎరువులు అవసరాన్ని బట్టి నమోదు చేసుకుని వెళ్ళేవారు. ఇప్పుడు రైతులే కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తుంది. – బుగత దీనబంధు, రైతు, మందస

## క్లుప్తంగా

### ఘనంగా చింతామణి మందిరం ప్రతిష్ట



ప్రతిష్ఠ కార్యక్రమంలో దాతలు

కంచిలి: మండల కేంద్రంలోని పద్మతుల గ్రామానికి వెళ్లే మార్గంలో మార్కెట్ యార్డు ఎదురుగా చింతామణి అమ్మవారు మందిర ప్రతిష్ట బుధవారం ఘనంగా జరిగింది. ఈ మందిరాన్ని కంచిలికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తకోట శేఖర్, నాగేశుబాబులు నిర్మించారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పార్టీ నేతలు కొల్లి ఈశ్వర రావు, లడ్డు కేశవపాత్రో, టీడీపీ నాయకుడు బంగారు కురయ్య, జగదీష్ పట్నాయక్, మాదిన రామారావు పాల్గొన్నారు.

### విద్యుత్‌షాక్ మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి



శ్యాంప్రసాద్‌రెడ్డి

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధి సామంతపుట్టుగ (చిల్లపుట్టుగ) గ్రామంలో ఈ నెల 26వ తేదీన విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ సీఎండీకి లేఖ రాసినట్లు బుధవారం తెలిపారు. సంఘటనకు సంబంధించి సీఎండీ గ్రామానికి విచ్చేసి వాస్తవ పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని కోరినట్లు చెప్పారు. నిరుపేద కుటుంబాలు కావడంతో ఆదుకోవాలన్నారు.

### పశువులకు గొంతువాపు నివారణా టీకాలు



పశువుకు వ్యాధి నివారణ టీకా వేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: పశు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి కిరణకుమార్ అన్నారు. కోటబొమ్మాళి మండలం ఊడికిలపాడులో పశువులకు ఉచితంగా గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 158 పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. వెటర్నరీ అసిస్టెంట్ వెంకటరమణ ఉన్నారు.

### 'కక్షసాధింపులే కూటమి ప్రభుత్వ ధ్యేయం'



దుర్యోధనరావు

కాశీబుగ్గ: కక్షసాధింపులే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. దీనికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టే నిదర్శనమన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గోవర్ధన్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఇది ప్రజల్లో మెదిలినప్పుడల్లా ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.

### ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి



పలాస ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

పలాస/కంచిలి/కవిటి/నందిగాం/టెక్కలి: దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతి వేడుకలను ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నిశాఖల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు కూడా జయంతి వేడుకలను నిర్వహించారు.

### జలవనరుల శాఖ కార్యాలయంలోకి వర్షం నీరు



కార్యాలయంలోనికి చేరిన వర్షం నీరు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని జలవనరుల శాఖా కార్యాలయం లోపలకు వర్షం నీరు చేరింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై ఉన్న వరద నీరంతా కార్యాలయం లోపలకు చేరింది. బుధవారం సిబ్బంది కార్యాలయానికి వచ్చి చూసేసరికి లోపల నీరు ఉండడంతో బయటకు మళ్లించే ప్రయత్నాలు చేశారు.

# యోగాతో మెరుగైన ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు

మందస: నిత్యం యోగా చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. ప్రపంచ 11వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలాభివృద్ధి కార్యాలయంలో బుధవారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు గ్రామ సచివాలయాల వారీగా సుమారు 200 మందికి యాగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్, సాయిబాబా మందిరం మీదగా ప్రధాన కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఏవో రుషేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో జయప్రకాశ్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోలకు క్యూఆర్ స్టిక్కర్లు



క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఆటో డ్రైవర్లకు అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అతికిస్తున్నట్టు ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ చెప్పారు. బుధవారం ఆయన మండలంలో ఉన్న ప్రయాణికుల ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదాలు, తప్పిదాలు, ఆటోవాళ్లు ప్రయాణికులను తప్పుదోవ పట్టించినా అందులో ప్రయాణించే వారు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటోకు సంబంధించి పూర్తి వివరాలు, సమాచారాన్ని రాబట్టేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.

## నిరుపేదలకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న యాచకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న రామాలయం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు అనాథులు, యాచకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి క్రిష్టారావు, దడియాల నర్సింహులు, సూరినారాయణ పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్: వాయువ్య బంగాళాఖాతం ఒడిశా తీరంలో అల్పపీడనం బలపడిందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీలో పూర్తిగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయని, వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడిన నేపథ్యంలో 24 గంటల్లో వాయుగుండంగా మారే సూచనలు ఉన్నట్లు ఉన్నతాధికారులు తెలిపినట్లు స్పష్టం చేశారు. దీని ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురువనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని సూచించారు. బుధవారం సాయంత్రం నాటికి మండలంలో 23.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. అధికారులు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

## రహదారి ఛిద్రం



పాడైన గంగాధరపేట రోడ్డు

టెక్కలి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు టెక్కలి మండలంలో పలు గ్రామాల్లో రహదారులు ఛిద్రంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లె పండగ పేరుతో రోడ్లు వేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కొన్ని గ్రామాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. మరో వైపు చిన్నపాటి వర్షానికే రోడ్లు ఛిద్రంగా మారడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## • అధ్వానంగా రోడ్డు



సంతబొమ్మాళి మండల కేంద్రం నుంచి పాలేశ్వరస్వామి ఆలయం కూడలి వరకు ఉన్న రోడ్ అధ్వానంగా తయారైంది. సుమారు అర కిలోమీటర్ దూరం ఉండే రోడ్డు గోతులు, గుంటలతో దర్శనమిస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు అనేక ఇబ్బందులుపడుతున్నారు. చినుక పడితే మరీ దారుణంగా రోడ్డు తయారవుతుంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –సంతబొమ్మాళి

## • ఆలయ పునః నిర్మాణ ప్రతిష్ట



సోంపేట మండలం కొర్లాంలోని శ్రీభూలోక మాత దేవాలయ పునః నిర్మాణ ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అమ్మవారి విగ్రహాల ఏర్పాటు, హోమం, అన్న ప్రసాద కార్యక్రమం, భజనలు నిర్వహించారు. కొర్లాం, పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – సోంపేట

# వాన కురిసింది..నేల మురిసింది..

ఇచ్ఛాపురం రూరల్: అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పంటపొలాల్లో నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటల సాగుకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ముచ్చింద్ర గ్రామంలోని పెద్దవీధిలో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్డు ఉన్నప్పటికీ.. బిల్లులు వస్తాయన్న ఆశతో స్థానిక కూటమి నాయకులు అదే సీసీ రోడ్డుపై వంద మీటర్ల వరకు సగం సీసీ రోడ్డు వేసి వదిలేశారు. దీంతో తాజాగా కురిసిన వర్షంతో నీరంతా సమీపంలోని ఇళ్లలోని చొరబడడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.



ఇచ్ఛాపురం రూరల్: ముచ్చింద్ర పెద్దవీధిలో నిలిచిపోయిన వర్షం నీరు

### కవిటిలో 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

కవిటి: కవిటి మండలంలో కూడా మోస్తరు వర్షం కురిసింది. బుధవారం కవిటి మండలంలో 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యిందని రెవెన్యూశాఖ అధికారులు తెలిపారు. తెల్లదోమతో తీవ్ర అవస్థలు పడుతున్న కొబ్బరి రైతుకు తాజాగా కురిసిన వర్షం ఎంతో మేలు చేస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు జల్లుకున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఇలాగే పడితే మొక్క దశలోనే కుళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు



కవిటి: బొరివంక వద్ద స్టేట్ హైవేపై వరదనీటి ప్రవాహం



ఇచ్ఛాపురం టౌన్: పొలంలో చేరిన నీరు

### ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం టౌన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో వాతావరణం చల్లబడింది. మండలంలో బుధవారం 23 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షంతో పంటపొలాల్లో నీరు చేరింది.

### చెరువును తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరద నీరు చేరి మండలంలోని బెండి-బెండి గేట్ ఆర్‌అండ్‌బీ రోడ్డు చెరువును తలపిస్తుంది. మరమ్మతులకు గురైన ఈ రోడ్డుపై ప్రయాణం సవాల్‌గా మారింది. అడుగడుగున గుంతలు ఉండడం, వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వరదనీరుతో పాటు బురదతో చిత్తగా, చెరువులా దర్శనమిస్తున్న రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది.



వజ్రపుకొత్తూరు రూరల్: చెరువును తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

## • శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట



ఇచ్ఛాపురం పట్టణంలోని గొల్లవీధి సత్యసాయిబాబా మందిరం సమీపంలో ఏర్పాట చేసిన ధ్యానాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వేదపండిల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గొల్లవీధి పెద్దలు, యువత, ఆంజనేయస్వామి దీక్షాపరులు పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం

# మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



అవగాహన కార్యక్రమంలో మహిళలు

ఇచ్ఛాపురం టౌన్: మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పురుషోత్తపురం అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి జూహిత అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పురుషోత్తపురం అగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కుటుంబ నియంత్రణ, శారీరక శుభ్రతను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సుబ్బలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.